
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



సోమశిలలో 49.06 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 49.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 24,931 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,790
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,265
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,543
నవర (8 గ్రాములు)	రూ.76,344

గరిష్టం/కనిష్టం
33.5 /25.2

వాతావరణం

జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులు మంగళవారం కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 65 శాతంగా సోమవారం నమోదైంది.

న్యూస్‌రీల్

ఘనంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



సర్వభూపాల వాహనసేవలో వెంకయ్యస్వామి

వెంకటాచలం: గొలగమూడిలో కొలువైన భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవ, అభిషేకం, రక్షాబంధన పూజ, దీక్ష వస్త్ర సమర్పణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సర్వభూపాల, కల్పవృక్ష వాహనసేవలను నిర్వహించారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించి గ్రామోత్సవాన్ని జరిపారు. గొలగమూడి గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఉత్సవాల్లో నేడు

ఉత్సవాల్లో భాగంగా సూర్యప్రభ, చంద్రప్రభ వాహనసేవలను మంగళవారం నిర్వహించనున్నారు.

కాకాణికి హైకోర్టులో ఊరట

- రుస్తుం మైనింగ్ కేసులో బెయిల్

నెల్లూరు (లీగల్): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్.లక్ష్మణరావు సోమవారం ఉత్తర్వులిచ్చారు. రుస్తుం మైన్‌లో జిలెటిన్ స్టిక్స్ పేలుడు పదార్థాలను ఉపయోగించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని నెల్లూరు రూరల్ డీఎస్పీ విచారణాధికారిగా పొదలకూరు పోలీసులు నమోదు చేసిన అట్రాసిటీ (ఎస్సీ, ఎస్టీ) కేసులో కాకాణి 4వ నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కాకాణి బెయిల్ కోసం ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకొన్నారు. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాదులు ఓ మనోహర్ రెడ్డి, చేజర్ల శుబోధ్ తమ వాదనలు వినిపించారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేస్తూ ఒక్కొక్కరు రూ. 2 లక్షలు ఆస్తి విలువ కలిగిన ఇద్దరు జామీన్‌దారులు పూచీకత్తు సమర్పించాలని, పోలీసుల విచారణకు సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాకాణి నెల్లూరు జిల్లాలో ఉండకూడదని, పాస్ పోర్టు సరెండర్ చేయాలని, ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు విచారణాధికారి వద్ద హాజరు కావాలని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు దాటి వెళ్లడానికి వీల్లేదని, కేసు విషయాలపై మీడియాతో మాట్లాడకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



అవార్డు అందుకుంటున్న ఫొటో జర్నలిస్టు పి.విజయకృష్ణ

సాక్షి ఫొటో జర్నలిస్టుకు అవార్డు

ప్రపంచ గిరిజన దినోత్సవం, ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం 2025 సందర్భంగా ప్రకటించిన జాతీయ స్థాయి అవార్డుల్లో నెల్లూరు 'సాక్షి' ఫొటో జర్నలిస్టు పి.విజయకృష్ణాకు సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డు లభించింది. సోమవారం బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో జాతీయ స్థాయి ఫొటో ప్రదర్శన వేడుకల్లో ఈ అవార్డును ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నిర్వాహకులు తదితరులు అందజేశారు.

– నెల్లూరు



అవార్డు లభించింది.. ఈ చిత్రానికే

గిరిజన పీఠంపై పెత్తందారుడికి పట్టం

- ▸▸ కోవూరు ఏఎంసీ గిరిజనులకు కేటాయిస్తూ తొలుత ఉత్తర్వులు

- ఎమ్మెల్యే ఆదేశాలతో రిజర్వేషన్‌కు పాతర
- గంట వ్యవధిలోనే ఓసీ జనరల్ చేస్తూ మరో ఉత్తర్వు
- గిరిజన హక్కులను కాలరాస్తూ చక్రం తిప్పిన వైనం
- ఓట్ల కోసమే వారిపై ప్రేమ.. పదవులు మాత్రం పెత్తందార్లకు
- ఏఎంసీ రిజర్వేషన్ మార్పుపై గిరిజన సంఘాల మండిపాటు
- కూటమి నేతల కుట్ర రాజకీయాలపై ఉద్యమించాలని నిర్ణయం

కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో మరోసారి గిరిజనుల హక్కులను తాకట్టు పెట్టినట్లు అయింది. రొటేషన్ నిబంధనల ప్రకారం ఈ దఫా చైర్మన్ స్థానం ఎస్టీ వర్గానికి కేటాయించాల్సి ఉంది. ఈ క్రమంలో ఆ వర్గంలోనూ అంచనాలు పెరిగి, కొత్త నాయకత్వం ఎదుగుతుందన్న ఆశలు మొదలయ్యాయి. కానీ అనూహ్యంగా గంటల వ్యవధిలోనే వెలువడిన మరో ఉత్తర్వుతో అదే పదవిని ఓసీ జనరల్‌కు కట్టబెడుతూ మార్చేశారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో ఈ మార్పు జరిగిందనే ఆరోపణలు మరింత బలంగా వినిపిస్తున్నాయి.

కోవూరు: 'రాణి తలుచుకుంటే.. గంటల వ్యవధిలో జీఓలే మారిపోతాయి'. అధికార యంత్రాంగం సైతం రిజర్వేషన్ నిబంధనలకు పాతరేస్తూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారు. అత్యధిక గిరిజన జనాభా ఉన్న కోవూరు నియోజకవర్గంలో రాజ్యాంగం నిర్దేశించిన రొటేషన్ విధానంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవి ఈ దఫా గిరిజనులకు కేటాయించాల్సి ఉంది. ఈ మేరకు ఈ పదవిని ఎస్టీ జనరల్‌కు రిజర్వేషన్ ఖరారు చేస్తూ కలెక్టర్ ఆనంద్ ఆర్సీ నంబరు 168/ఎస్ఎంఏ/2024 ప్రకారం ఈ నెల 14వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు బయటకు వచ్చిన కొద్ది సేపటికే అదే ఉత్తర్వును సవరిస్తూ కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ పదవిని ఓసీ జనరల్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు బయటకు వచ్చాయి. దీని వెనుక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మంత్రాంగం నడిపారని కలెక్టరేట్‌లోని విశ్వసనీయ వర్గాల తెలిసింది.


రాజకీయంగా ఎదగడం ఇష్టంలేకే..

అనేక సంవత్సరాల తర్వాత రొటేషన్ విధానంలో మొదటగా గిరిజనులకు వచ్చిన అవకాశాన్ని చివరి నిమిషంలో రద్దు చేయడంపై రాజకీయ వర్గాల్లో ఆగ్రహం రేకెత్తిస్తోంది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కేవలం ఒక రాజకీయ పదవి మాత్రమే కాదు. రైతుల జీవితాలతో ముడిపడి ఉండే ఈ పదవి ఎంతో ప్రభావవంతమైంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చే ఈ పదవి గిరిజన నేతలకు దక్కి ఉంటే రాజకీయాల్లో వారి ప్రాతినిధ్యం పెరిగేది. కానీ దాన్ని అడ్డుకుని మళ్లీ సంపన్న వర్గాలకే కట్టబెట్టడం ద్వారా గిరిజనుల ఎదుగుదలకు సమాధి కట్టినట్టే అయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓట్ల కోసం గిరిజనులపై ప్రేమ చూపించే ప్రభుత్వానికి, పదవులు మాత్రం పెత్తందార్లకే కట్టబెట్టడంపై స్థానిక గిరిజన నేతలు తీవ్ర స్థాయిలో ప్రశ్నిస్తున్నారు. గిరిజనులు ఓటు వేయడానికి మాత్రమేనా? అధికారంలో భాగస్వామ్యం కోసం కాదా? అంటూ నిలదీస్తున్నారు. మాటల్లో గిరిజన సంక్షేమం అంటూ నినదించే అధికార కూటమి, ఆచరణలో మాత్రం నమ్మక ద్రోహం చేస్తోందని వాస్తవం మరోసారి బయటపడింది.




విడవలూరు టీడీపీ నేతకు కట్టబెట్టేందుకే..

కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ పదవిపై టీడీపీలోని అగ్రకుల నేతలు కన్నేశారు. జిల్లాలో అత్యధికంగా గిరిజన జనాభా ఉన్న నియోజకవర్గాల్లో కోవూరు ఒకటి. వాస్తవంగా కోవూరు ఏఎంసీ పదవి రొటేషన్ పద్ధతిలో ఈ దఫా గిరిజనులకు కేటాయించాల్సి ఉంది. ఈ పదవిని దక్కించుకునేందుకు రాజకీయ కుతంత్రాలకు తెరతీశారు. ఈ పదవికి ఎంతో మంది పోటీపడుతున్నారు. అయితే గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన విడవలూరు మండలానికి చెందిన ఓ నేతకు ఈ పట్టం కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చక్రం తిప్పారని స్థానిక రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్ చర్చ జరుగుతోంది. కోవూరు ఏఎంసీ చైర్మన్ పదవి ఎస్టీ జనరల్‌కు కేటాయిస్తూ సాక్షాత్తు కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు.. మరి కొద్ది సేపటికే మార్చేస్తూ ఈ పదవిని ఓసీ జనరల్‌కు కేటాయించడం వెనుక రాజకీయ ఒత్తిడి కనిపిస్తోందని స్పష్టమవుతోంది.


Proceedings of the Collector & District Magistrate, SPSR Nellore District

తొలుత జారీ చేసిన జీఓ..


Proceedings of the Collector & District Magistrate, SPSR Nellore District

ఆపై ఓసీలకు మారుస్తూ విడుదలైన ఉత్తర్వు

ఏఎంసీ పీఠం కోసం తమ్ముళ్ల మధ్య పోటీ

కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ పదవిపై ఆశలు పెట్టుకున్న ఎంతో మంది ఆశావహులు ఈ దఫా గిరిజనులకే దక్కుతుందని భావించి సైలెంట్ అయిపోయారు. తాజాగా ఏఎంసీ పీఠం ఓసీ జనరల్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడడంతో నియోజకవర్గంలోని ఆశావహులు ఆ పదవిని దక్కించుకునేందుకు పైరవీలు చేసుకుంటున్నారనే సమాచారం. కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలాలకు చెందిన ముఖ్య నేతలు ఇప్పుడు ఎమ్మెల్యే ఇంటి ముందు క్యూకడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరికి పదవి కట్టబెట్టినా మరొకరు అలకబూనే అవకాశం ఉండడంతో ఈ పరిణామాలు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి తలనొప్పిగా పరిణమించాయి.

గిరిజనులకు రాజకీయ నమ్మక ద్రోహం

అధికార పీఠం కోసం గిరిజన జపం చేసే పాలకులు అధికారం దక్కగానే తమ స్వప్రయోజనాల కోసం అగ్రకుల సంపన్నులకు కట్టబెట్టేందుకు గిరిజనులకు నమ్మక ద్రోహం చేస్తున్నారనే ఆరోపణలకు కోవూరు వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్ ఉదాహరణగా నిలుస్తోంది. చరిత్రాత్మకంగా గిరిజనులకిచ్చే అవకాశాన్ని అడ్డుకోవడం, వారిని మరోసారి పక్కన పెట్టడం మాత్రమే కాకుండా, వారి భవిష్యత్‌కు సమాధి చేయడమే అని గిరిజనులు, ఆ సంఘ నాయకులు మండిపడుతున్నారు. కూటమి నేతల స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం గిరిజనలకు చేస్తున్న రాజకీయ ద్రోహంపై ప్రజాక్షేత్రంలో ఉద్యమించడానికి గిరిజన సంఘాలు ఉద్యుక్తమవుతున్నాయి.

కాకాణి కమింగ్..!

ప్రభుత్వ వైఫల్యాలను, అసమర్థతను ప్రశ్నిస్తున్నారని, ప్రజల గొంతుకై నిలదీస్తున్నాడని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి 86 రోజులుగా జిల్లా కేంద్ర కారాగారంలో నిర్బంధించారు. ఒకదాని తర్వాత మరొకటి లెక్కన దాదాపు 16 అక్రమ కేసులు బనాయించి వెంటనే బెయిల్ రాకుండా కూటమి ప్రభుత్వ కుట్రలను పోలీసులు అమలు చేశారు. ఇప్పటికే అనేక కేసుల్లో నెల్లూరు, గూడూరు న్యాయ స్థానాల్లో బెయిళ్లు వచ్చాయి. తాజాగా హైకోర్టు సోమవారం మిగతా కేసుల్లో బెయిల్ మంజూరు కావడంతో అన్ని కేసుల్లోనూ పూర్తిస్థాయిలో బెయిళ్లు రావడంతో మంగళవారం జిల్లా కేంద్ర కారాగారం నుంచి విడుదల కానున్నారు.

- ప్రశ్నించే గొంతుక 86 రోజులుగా కారాగారంలో నిర్బంధం
- కూటమి పెట్టిన అక్రమ కేసులన్నింట్లో న్యాయస్థానాల నుంచి బెయిల్
- కుటుంబసభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆనందం
- నేడు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగంతో మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులన్నిట్లో పూర్తి స్థాయిలో బెయిళ్లు రావడంతో 86 రోజుల కారాగార నిర్బంధం నుంచి మంగళవారం విడుదల కానున్నారు. అధికారంలోకి రావడానికి కూటమి నేతలు అనేక హామీలిచ్చారు. అధికారం దక్కాక ఏడాది కాలంగా ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ వచ్చింది. పోలీసు వ్యవస్థను గుప్పెట్లో పెట్టుకుని రాజకీయ ప్రత్యర్థులపై భౌతికదాడులు, ఆస్తుల ధ్వంసానికి టీడీపీ ముష్కర మూకలు తెగబడ్డాయి. ఈ చర్యలను నిలదీస్తుండడంతో అప్రజాస్వామిక రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాజకీయ ప్రత్యర్థులపై అక్రమంగా కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ వైఫల్యాలను, సూపర్ సిక్స్ హామీల అమల్లో అసమర్థత, ప్రజావ్యతిరేక విధానాలతోపాటు స్థానిక ఎమ్మెల్యే వైఫల్యాలను కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎండగట్టుతూ వచ్చారు. దీన్ని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం ఆయన్ను టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారు. జైల్లో ఉండగానే ఐదారేళ్ల క్రితం నాటి కేసులతోపాటు కోర్టుల్లో చార్జ్‌షీట్లు దాఖలైన కేసుల్లోనూ కాకాణి పేరుతో జత చేసి ఒకటి తర్వాత మరొకటి పీటీ వారెంట్లు వేస్తూ ఆయన్ను జైలు నుంచి రాకుండా అడ్డుకున్నారు. ఈ విధంగా దాదాపు 86 రోజులుగా జైల్లో ఉండేలా చేసింది. అక్రమ కేసులపై కాకాణి గోవర్ధన్‌రెడ్డి న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఇప్పటికే ఏడు కేసుల్లో ఆయనకు న్యాయస్థానం బెయిళ్లు మంజూరు చేసింది. తాజాగా తాటిపర్తి రుస్తుం మైన్స్ కేసులో సోమవారం హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో కాకాణి కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానుల్లో ఆనందం నెలకొంది. మంగళవారం ఆయన జైలు నుంచి బయటకు రానున్నారు. దీంతో ఆయనకు స్వాగతం పలికేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధమవుతున్నారు.

అక్రమ కేసుల్లో వచ్చిన బెయిళ్లు

➡ సర్వేపల్లి జలాశయం నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించారని ఆరోపిస్తూ కాకాణిపై వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన కేసులో జూన్ 27న నెల్లూరు రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శారదారెడ్డి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

➡ కృష్ణపట్నం పోర్టులో కృష్ణపట్నం లాజిస్టిక్స్ పేరుతో అసోసియేషన్ ఏర్పాటు చేయించి లారీ, కంటైనర్ ఓనర్లను బెదిరించి అక్రమంగా ఎక్కువ బాడుగలను వసూలు చేశారంటూ కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ముత్తుకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో జూలై 10న నెల్లూరు రైల్వే కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి నిషాద్‌నాజ్ షేక్ బెయిల్‌ను మంజూరు చేశారు.

➡ పొదలకూరు మండలం విరువూరులో అక్రమంగా మద్యం నిల్వలు ఉంచారని కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పొదలకూరు ఎక్సైజ్ అధికారులు నమోదు చేసిన అక్రమ కేసులో జూలై 29న గూడూరు అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బీవీ సులోచనారాణి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

➡ కనుపూరు చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినట్లు వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో ఈ నెల 7వ తేదీన నెల్లూరు నాల్గో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి నిషాద్‌నాజ్ షేక్ బెయిల్ మంజూరు చేశారు.

➡ ఇందుకూరుపేట ఎక్సైజ్ అధికారులు నమోదు చేసిన అక్రమ కేసులో ఈ నెల 11న నెల్లూరు నాల్గో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నిషాద్ నాజ్ షేక్ బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

➡ ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు చేశారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై నమోదైన కేసులో ఈ నెల 12న నెల్లూరు రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎల్.శారదారెడ్డి బెయిల్ మంజూరు చేశారు.

➡ రుస్తుం మైన్స్ అక్రమ కేసులో సోమవారం హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇక మిగిలిన కేసుల్లో పోలీసు అధికారులు 41ఏ నోటీసులు అందజేశారు.

బార్ల ఏర్పాటుకు గెజిట్ విడుదల

- జిల్లాలో ఓపెన్ కేటగిరీలో 50కు అనుమతులు
- ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్లో దరఖాస్తుల స్వీకరణ
- 26తో ముగియనున్న గడువు
- 28న కలెక్టర్ సమక్షంలో లాటరీ



వివరాలను వెల్లడిస్తున్న శంకరయ్య

నెల్లూరు (క్రైమ్): నూతన పాలసీకి అనుగుణంగా జిల్లాలో 2025 – 28 సంవత్సరానికి గానూ ఓపెన్ కేటగిరీ కింద 50 బార్ల ఏర్పాటుకు గెజిట్‌ను కలెక్టర్ ఆనంద్ సోమవారం విడుదల చేశారు. ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్ / హైబ్రిడ్ విధానాల్లో సోమవారం నుంచి 26వ తేదీ సాయంత్రం ఐదు వరకు దరఖాస్తుల స్వీకరణ.. కలెక్టర్ సమక్షంలో 28న లాటరీ తీసి ప్రొవిజనల్ లైసెన్స్‌లను మంజూరు చేయనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య తన కార్యాలయంలో డీపీఈఓ శ్రీనివాసులునాయుడితో కలిసి వెల్లడించారు.

జిల్లాలో ఇలా..

మూడేళ్ల కాలపరిమితితో నగరంలో 38.. కావలిలో ఏడు.. కందుకూరులో మూడు.. ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెంలో ఒకటి చొప్పున 50 బార్లు ఏర్పాటు కానున్నాయి. జనాభా ప్రాతిపదికన మూడు శ్లాబుల్లో లైసెన్స్ ఫీజులను ఖరారు చేశారు. నగరంలో రూ.75 లక్షలు.. కావలి, కందుకూరులో రూ.55 లక్షలు.. ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీల్లో రూ.35 లక్షలుగా నిర్ణయించారు. ఏటా పది శాతం లైసెన్స్ ఫీజును అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. దీని రూపేణా తొలి ఏడాది రూ.36.17 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరనుంది.

దరఖాస్తు ప్రక్రియ..

➡ నూతన బార్ పాలసీలో దరఖాస్తు ఫీజుగా రూ.ఐదు లక్షలు (నాన్ రీఫండబుల్)ను ఖరారు చేశారు.

➡ ఆన్‌లైన్లో oc. hpfsproject. com ద్వారా ఎక్కడి నుంచైనా ఫారం – బీ (ఆర్)లోని వివరాలను నింపి దరఖాస్తును సమర్పించొచ్చు. దరఖాస్తు రుసుము, ప్రాసెసింగ్ ఫీజును డెబిట్, క్రెడిట్ కార్డు, నెట్‌బ్యాంకింగ్ ద్వారా చెల్లించొచ్చు.

➡ ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకునేవారు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తు రుసుము, ప్రాసెసింగ్ ఫీజు రూ.ఐదు లక్షలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పేరుపై, రూ.పది వేలు కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పేరుపై సమర్పించాలి. దీనికి గానూ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

➡ ఇతర రాష్ట్రాలకు చెందిన వారు సైతం దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఒక వ్యక్తి ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. నూతన బార్లు సెప్టెంబర్ ఒకటి నుంచి అందుబాటులోకి రానున్నాయి.

గీత కులాలకు ఐదు బార్లు

జిల్లాలో గీత కులాల కోసం ఐదు బార్లను ప్రత్యేకంగా కేటాయించారు. నెల్లూరు నగరపాలక సంస్థలో గౌడ కులస్తులకు రెండు బార్లను కేటాయించగా, లైసెన్స్ ఫీజుగా రూ.37.50 లక్షలను నిర్ణయించారు. కావలి మున్సిపాల్టీలో గమళ్ల.. కందుకూరులో గౌడ కులస్తులకు కేటాయించి.. లైసెన్స్ ఫీజుగా రూ 27.5 లక్షలను ఖరారు చేశారు. అల్లూరు నగర పంచాయతీలో గౌడ కులస్తులకు ఒక బార్‌ను కేటాయించి.. లైసెన్స్ ఫీజుగా రూ 17.5 లక్షలను నిర్ణయించారు. ఈ నోటిఫికేషన్ 20న విడుదల కానుంది. అదే రోజు నుంచి 29వ తేది సాయంత్రం ఐదు వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. 30న లాటరీ విధానంలో బార్లను కేటాయించనున్నామని డీసీ తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు రమేష్, కిశోర్, శ్రీనివాసరావు, ఎస్సై ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఆగిన వారికి రీ వెరిఫికేషన్

నెల్లూరు(అర్బన్): సామాజిక పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు, ఇతర అవయవ లోపం గల వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ వెరిఫికేషన్‌ను పెద్దాస్పత్రిలో గతంలో నిర్వహించారు. అయితే అనివార్య కారణాలతో కొందరు రాలేకపోయారు. దీంతో వీరందరికీ పింఛన్లను ఆగస్టు ఒకటిన పంపిణీ చేయకుండా నిలిపేశారు. ఈ క్రమంలో కలెక్టర్‌కు అర్జీని అందజేసి పింఛన్లను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. ఈ తరుణంలో ఆయన ఆదేశాల మేరకు డీఆర్డీఏ అధికారులు మరో అవకాశం కల్పించారు. పెద్దాస్పత్రిలో రీ వెరిఫికేషన్ క్యాంప్‌ను బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఏర్పాటు చేయనున్నారు. రీ వెరిఫికేషన్‌కు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని, అలా కాని పక్షంలో పింఛన్‌ను పునరుద్ధరించేదిలేదని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి స్పష్టం చేశారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

నెల్లూరు (లీగల్): అప్పు తీసుకొని తిరిగి చెల్లించే క్రమంలో చెల్లని చెక్కును ఇచ్చారనే కేసులో నేరం రుజువు కావడంతో నగరంలోని నాగులమిట్టకు చెందిన ప్రళయకావేరి చిన్నాకు ఏడాది జైలు శిక్షను విధిస్తూ నెల్లూరు మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రెహమాన్ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు.. తన అవసరాల నిమిత్తం దర్గామిట్టలోని పాత మిలటరీ కాలనీకి చెందిన నరసింహారావు వద్ద 2018, మార్చి 22న రూ.7.5 లక్షలను అప్పుగా తీసుకొని ప్రామిసరీ నోటును చిన్నా రాసిచ్చారు. తిరిగి చెల్లించే క్రమంలో మరుసటి ఏడాది మే ఏడున రూ.7.5 లక్షలకు చెక్కును కరూర్ వైశ్య బ్యాంక్ పేరిట ఇచ్చారు. అదే రోజున ఐబీబీఐలోని తన ఖాతాలో నరసింహారావు జమ చేయగా, నగదు లేని కారణంగా చెక్కు బౌన్సయింది. దీంతో తన న్యాయవాది ద్వారా నోటీస్ పంపి కోర్టులో కేసు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో చెక్కు మొత్తం రూ.7.5 లక్షలు, పరిహారంగా మరో రూ.7.4 లక్షలను ఫిర్యాదుదారుడికి చెల్లించాలని, రూ.పది వేలను ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని తీర్పుచెప్పారు.

శ్రీకాంత్‌రెడ్డికి అస్వస్థత

- చికిత్స అనంతరం జైలుకు తరలింపు

నెల్లూరు(క్రైమ్): మైనింగ్ అక్రమ కేసులో జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం గుండెనొప్పితో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి హార్ట్‌బీట్ తక్కువగా ఉందని చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని, తర్వాత హృద్రోగ వైద్యుల పర్యవేక్షణలో మరికొన్ని పరీక్షలు చేయించాలని వైద్యులు సూచించడంతో శ్రీకాంత్‌రెడ్డిని తిరిగి జైలుకు తీసుకెళ్లారు. త్వరలో ఆయన్ను తిరుపతి రుయా హాస్పిటల్‌కు తరలించనున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

రైల్లోంచి జారిపడి..

• హెల్త్ అసిస్టెంట్ మృతి


రామ్‌కుమార్ మృతదేహం


కొడవలూరు: ప్రమాదవశాత్తు రైల్లోంచి జారిపడి హెల్త్ అసిస్టెంట్ మృతిచెందిన ఘటన మండలంలోని తలమంచి – కొడవలూరు రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు కథనం మేరకు.. బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీలో హెచ్‌ఏగా పనిచేసే ఎస్.రామ్‌కుమార్ ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ సమీపంలో నివాసముంటున్నాడు. రోజూ అక్కడి నుంచే విధులకు వస్తుంటాడు. సోమవారం కూడా రైల్లో బయలుదేరాడు. తలమంచి సమీపంలో 188 – 9 – 7 పోస్టుల మధ్య ఎగువలైన్‌లో రైల్లో నుంచి జారిపడి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

చెక్‌పోస్ట్ పాయింట్‌ను ఢీకొన్న లారీ


ధ్వంసమైన చెక్‌పోస్ట్

మర్రిపాడు: మండలంలోని జిల్లా సరిహద్దు వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై సరిహద్దు వద్దనున్న చెక్‌పోస్ట్ పాయింట్‌ను లారీ ఢీకొనడంతో అది పూర్తిగా నేలమట్టమైంది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నంద్యాల నుంచి తడకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.123
లేయర్	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.224
స్కిన్‌లెస్ చికెన్	: రూ.250
లేయర్ చికెన్	: రూ.200

పోటెత్తి.. వినతులందించి..

• కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
• 426 అర్జీల అందజేత


వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

నెల్లూరు రూరల్: నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. కలెక్టర్ ఆనంద్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డ్వామా పీడీ గంగా భవాని, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి సమస్యలు తెలుసుకున్నారు. అధికంగా రెవెన్యూ శాఖవి 129, మున్సిపల్ శాఖవి 31, సర్వేవి 34, పంచాయతీరాజ్ శాఖవి 57, పోలీసు శాఖవి 79, సివిల్ సప్లయ్స్‌వి 7, ఇతర శాఖలకు సంబంధించి 426 అర్జీలను ప్రజలు అందజేశారు.

రిజర్వేషన్ల అమలు కోసం..

చంద్రబాబు గతంలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటూ బీఎస్పీ నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రిజర్వేషన్లు అమలు చేయకపోతే కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు దారుణం

రాష్ట్రవ్యాప్తంగా 1.5 లక్షల మందికి పైగా దివ్యాంగుల పెన్షన్లను కూటమి ప్రభుత్వం తొలగించిందని, ఇది దారుణమని ఆ సంఘం జిల్లా నాయకుడు ఆవుల నాగేంద్ర అన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ధైర్యముంటే ఫేక్ సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్లను అరెస్ట్ చేయాలన్నారు. అన్ని అర్హతలున్న వారిని కూడా పెన్షన్ రాకుండా చేయడం దారుణమన్నారు.

ఈ–క్రాప్‌పై చర్యలకు..

మరో వారం, పదిరోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయని, ఇంత వరకు ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి కాకపోవడం రైతులకు ఇబ్బందిగా మారుతుందని, వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వినయ్ నారాయణ కోరారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

కక్షతో జీతం ఆపేసిన వైద్యాధికారి

కక్ష కట్టి జలదంకి వైద్యాధికారి శ్రీనివాసులు రెండు సంవత్సరాల నుంచి జీతం ఆపేశారని కావలికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ రసూల్ కలెక్టర్‌కు వినతిపత్రమిచ్చారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివాసులు, ఆయన భార్య డాక్టర్ లక్ష్మి వేధిస్తున్నట్లు ఆరోపించారు. జీతాలు చెల్లించాలని డీఎంహెచ్‌ఓ ఆర్డర్ ఇస్తే పెడచెవిన పెట్టి నువ్వు ఎలా తెచ్చుకుంటావో చూస్తానని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. లేబర్ కమిషన్ ఆర్డర్‌ను కూడా పట్టించుకోలేదన్నారు. హెల్త్ డైరెక్టర్ విచారణ రిపోర్ట్‌లో జీతం జలదంకిలోనే చెల్లించాలని చెప్పిందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగి అయిన తనకు రెండేళ్లుగా జీతం లేదని, ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు.


నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

పోస్టులు భర్తీ చేయాలంటూ..

మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 203 పోస్టులను 2025 డీఎస్సీలోనే భర్తీ చేయాలని అభ్యర్థులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ నోటిఫికేషన్‌లో నెల్లూరు కార్పొరేషన్‌లో 16 ఖాళీలను మాత్రమే చూపించారన్నారు. అయితే 203 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జి.కృష్ణప్రసాద్, పి.నాగరాజు, కిశోర్, మస్తాన్, కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో జామాయిల్ నరికివేత

• విలువ సుమారు రూ.15 లక్షలు
• రెవెన్యూ అధికారుల పాత్రపై ప్రచారం
• అధికార పార్టీ అండతోనే..


జామాయిల్ నరికింది ఇక్కడే..

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు – ఉదయగిరి హైవే మార్గంలో వింజమూరు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 839లో 12 ఎకరాల ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్న జామాయిల్‌ను అక్రమార్కులు నరికి సొమ్ము చేసుకున్నారు. మూడురోజుల క్రితం వింజమూరుకు చెందిన ఓ వ్యాపారి జామాయిల్ కర్రను పట్టపగలే నరికించి వాహనాల్లో తరలించినట్లుగా తెలిసింది. దీని విలువ సుమారు రూ.15 లక్షలని చెబుతున్నారు. ఈ తంతు వెనుక రెవెన్యూ సిబ్బంది పాత్ర ఉన్నట్లు ప్రచారం ఉంది. తహసీల్దార్ కార్యాలయానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భూమిలో జామాయిల్ నరికి తరలిస్తున్నా అధికారులు మాకు తెలియదని చెప్పడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో అధికార పార్టీ వారి పాత్ర ఉందనే ఆరోపణలున్నాయి. తహసీల్దార్ ఎస్‌కే హమీద్‌ను వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ సిబ్బందిని పంపామన్నారు. జామాయిల్ నరికిన మాట వాస్తవమేనన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఆ భూముల్లోనే సోమవారం పొట్టును వాహనంలో తరలిస్తున్నా రెవెన్యూ సిబ్బంది వదిలేసినట్లుగా ప్రచారం జరుగుతోంది.

విద్యుదాఘాతానికి గురై..

• రైతు మృతి

జలదంకి: విద్యుదాఘాతానికి గురై గునపాటి సురేష్‌రెడ్డి (35) అనే రైతు మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. సురేష్‌రెడ్డికి కొత్తపాళెంలో పొలం ఉంది. దీంతోపాటు గుంటూరుకు చెందిన వారి వద్ద కొంత పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సోమవారం పొలంలో ట్రాక్టర్‌తో పని చేశాడు. అనంతరం మోటార్ నుంచి నీరు రావడంలేదని గమనించాడు. మోటార్ వద్దకు వెళ్తుండగా కాలువ దాటే క్రమంలో కాలు జారి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానిక రైతులు గమనించి అక్కడికి వెళ్లేసరికి సురేష్‌రెడ్డి కాళ్లు, చేతులు కాలిపోయి మృతిచెంది ఉన్నాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య మనీషా, మూడు సంవత్సరాల కుమార్తె రుత్విక, సంవత్సరం వయసున్న బాలుడు యోగేష్ ఉన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.30
పండ్లు	: రూ.15

పెళ్లికెళ్లొస్తూ కానరాని లోకాలకు..

• ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న టాటా ఏస్
• ఇద్దరి మృతి, ఒకరికి తీవ్రగాయాలు
• బాధితులంతా చెన్నై వాసులు


ఘటనా స్థలంలో వాహనాలు


డ్రైవర్ హుస్సేన్ మృతదేహం

కొడవలూరు: టాటా ఏస్‌లో పెళ్లికెళ్లి.. తిరిగి సొంతూరికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని నాయుడుపాళెం వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చెన్నైకి చెందిన వారు కావలిలో ఆదివారం రాత్రి జరిగిన పెళ్లికి టాటా ఏస్ వాహనంలో వెళ్లారు. కార్యక్రమం పూర్తయ్యాక అదే వాహనంలో సోమవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో చెన్నైకి బయలుదేరారు. కొడవలూరు మండలం నాయుడుపాళెం వద్దకు రాగా ఇక్కడ ఆగిఉన్న టిప్పర్‌ను టాటాఏస్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టాటా ఏస్ నడుపుతున్న హుస్సేన్ (38), పక్క సీట్లో కూర్చున మాధవరావు (55)లు అక్కడికక్కడే మృతిచెందారు. ట్రక్కులో కూర్చున్న సుందరం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వీరంతా చెన్నై వాసులే. సుందరాన్ని నెల్లూరులోని కిమ్స్ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆస్తి రాయించుకుని గెంటేశాడు

• కుమారుడిపై తండ్రి ఫిర్యాదు
• సమస్యలు తెలుసుకున్న ఎస్పీ కృష్ణకాంత్
• న్యాయం చేస్తామని భరోసా


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'నా చిన్న కుమారుడు ఆస్తి రాయించుకుని నన్ను ఇంటి నుంచి గెంటేశాడు. విచారించి న్యాయం చేయాలి' అని నెల్లూరు సంతపేటకు చెందిన ఓ వృద్ధుడు కోరాడు. ఉద్యోగం పేరిట నగదు తీసుకుని మోసగించాడు.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి నిరాకరించాడు.. కుమారుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు.. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి గాథ. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 78 మంది విచ్చేసి తమ సమస్యలపై ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన చట్టపరిధిలో విచారించి న్యాయం చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర డీఎస్పీ పి.సింధుప్రియ, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

• నా కొడుకు, కోడలు ఇంటి నుంచి గెంటేశారు. రాత్రిపూట బస్టాండ్‌లో ఉంటున్నాను. విచారించి న్యాయం చేయాలని కావలికి చెందిన ఓ వృద్ధురాలు కోరారు.

• లింక్డిన్ ద్వారా మాధురి, వెంకటరమణ, చేతన్‌లు పరిచయమయ్యారు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.34 లక్షలు నగదు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగివ్వకుండా మోసగించారని పొదలకూరుకు చెందిన దంపతులు ఫిర్యాదు చేశారు.

• హైదరాబాద్‌కు చెందిన సుదర్శన్ క్రిప్టో ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ.8 లక్షలు పెట్టుబడి పెట్టించాడు. ఆరునెలల నుంచి ప్రాఫిట్ ఇవ్వకుండా, నగదు తిరిగివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని నెల్లూరు రూరల్‌కు చెందిన ఓ వ్యక్తి వినతిపత్రమిచ్చాడు.

• నా కుమారుడికి 15 సంవత్సరాలు. అతడితో ఆత్మకూరుకు చెందిన ఓ యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకుంది. పదిరోజుల క్రితం కుమారుడిని తీసుకెళ్లి బలవంతంగా పెళ్లిచేసుకుని దాచిపెట్టింది. ఆచూకీ కనుక్కోవాలని వేదాయపాళెనికి చెందిన ఓ మహిళ కోరారు.

• ఉదయగిరికి చెందిన వెంకటకుమార్ ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇప్పుడు పెళ్లికి నిరాకరించాడు. ఇదేమని అడిగితే సోషల్ మీడియాలో ఫొటోలు అప్‌లోడ్ చేసి ఇబ్బందులు పెడుతున్నాడు. విచారించి న్యాయం చేయాలని అదే ప్రాంతానికి చెందిన ఓ యువతి విజ్ఞప్తి చేశారు.

• నా కుమారుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, కారకులపై చర్యలు తీసుకోవాలని ముత్తుకూరుకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

జామాయిల్ తోటలో మహిళ మృతదేహం

కావలి(జలదంకి): కావలి మండలం సిరిపురం శివారు జామాయిల్ తోటలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని వీఆర్‌ఏ రాములుకు తెలపడంతో అతను కావలి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సైలు బాజీబాబు, తిరుమలరెడ్డి, వీఆర్వో దత్తమ్మ కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మహిళ వయసు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. 20 రోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని చెబుతున్నారు. మహిళ ఆరెంజ్ కలర్ చీర ధరించి ఉంది. రెండు కాళ్లకు రెండు రకాల పాదరక్షలున్నాయి. మతిస్థిమితంలేని మహిళ లేదా యాచకురాలై ఉండొచ్చని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేల్ నర్సులపై జూనియర్ డాక్టర్ దాడి

• సర్వజన ఆస్పత్రిలో ఉద్రిక్తత


జీజీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న నర్సులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న మేల్ నర్సు వెంకటప్ప అలియాస్ వెంకట్‌పై సోమవారం రాత్రి ఇంటర్న్‌షిప్ (జూనియర్) డాక్టర్ ఒకరు దాడి చేశాడు. మరో మేల్ నర్సు కల్యాణ్ అడ్డుపడగా అతడిపై కూడా దాడి చేశాడు. ఆ డాక్టర్‌కు మరో జూనియర్ అండగా ఉండి దాడి చేశారని సమాచారం. ఈ విషయమై పలువురు మేల్, ఫిమేల్ నర్సులు ఆస్పత్రి వద్ద బైఠాయించారు. దాడికి గురైన మేల్ నర్సులిద్దరూ తాము అడ్మిట్ అవుతామని, దాడికి కారణమైన వారిపై మెడికల్ లీగల్ కేసు నమోదు చేయాలని కోరగా క్యాజువాలిటీలో ఉన్న డ్యూటీ డాక్టర్ కిరణ్ తిరస్కరించాడు. దీంతో చాలాసేపు ఆందోళన జరిగింది. కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దర్గామిట్ట పోలీసుస్టేషన్‌లో దాడి చేసిన జూనియర్ డాక్టర్‌పై కేసు పెట్టేందుకు మేల్ నర్సులు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. విషయం తెలిసిన హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి గొడవకు కారణాలపై ఆరాతీశారు.

కండలేరులో 28.59 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 28.59 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 7,160 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,740, పిన్నేరు కాలువకు 30, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.